హైదరాబాద్ వార్త

పదిలో అమ్మాయిలదే పైచేయి

- గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు - 89.23 ఉత్తీర్ణతతో హైదరాబాద్ చివరిస్థానం

హైదరాబాద్,ఏప్రిల్ 30,ప్రభాతవార్త: పదోతరగతి వార్షిక ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తాచాటారు. గతేడాది మాదిరిగానే మెరుగైన ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేసుకుని విజయదుందుభి మోగించారు. గతేడాది లాగే ఈసారి కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణులై తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన 74,099 మంది విద్యార్థుల్లో 66,115 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష రాసిన వారిలో 34,591 మంది అమ్మాయిలు పాస్ కాగా, 31,524 మంది అబ్బాయిలు ఉత్తీర్ణత సాధించారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం ప్రైవేట్ పిల్లలతో పోటీపడి అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. అయితే బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ఇంటర్మీడియట్ మాదిరిగా బాలుర కంటే బాలికలే అధికశాతం ఉత్తీర్ణత సాధించడం ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ జిల్లాలో పరీక్ష రాసిన మొత్తం విద్యార్థుల్లో 89.23 శాతం ఉత్తీర్ణతతో పాస్ అయ్యారు. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో 98.72 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా. .మైనార్టీ రెసిడెన్షియల్‌లో 97.30శాతం, బిసి వెల్ఫేర్ స్కూళ్లలో 95.62శాతం ,రెసిడెన్షియల్ స్కూళ్లలో 91.41, ఎయిడెడ్ స్కూళ్లలో 91.30 శాతం, ప్రైవేట్ స్కూళ్లలో 89.25 నమోదు కాగా ప్రభుత్వ స్కూళ్లలో 84.44శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,984 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం మీద హైదరాబాద్ జిల్లాలో పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు

ముష్కిన్ చెరువులో నిర్మాణాలు చేపట్టొద్దు

-ఎఫ్టీఎల్ పరిధిని రక్షించేందుకు హైడ్రా చర్యలు - షెడ్లు నిర్మించిన వారికి 10 రోజులు గడువు

ముష్కిన్ చెవులు ఎఫ్టీఎల్ పరిధిలో ఏర్పాటైన తాత్కాలిక షెడ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: "మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్ టీఎల్ (ఫుల్ ట్యాంక్) పరిధిలో ఉన్నారు. ఇక్కడ తాత్కాలిక షెడ్డుల్లో ఉంటున్నారు.. మిమ్ములను పావులుగా వాడుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు,మట్టి పోసి.. చెరువు స్వరూపాన్ని మార్చేసి బడా నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. ఇక్కడే చెత్తను వేరు చేసి వ్యర్థాలను చెరువులోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువు కలుషితమౌతోంది. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి.. వారి ఆక్రమణలను తొలగించకుండా అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మీరంతా ఖాళీ చేస్తే. చెరువును అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. ఇక్కడ చెరువు అభివృద్ధి పనులు చేసేవారికి ఆటంకాలు కల్పించవద్దు "అని రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, నార్సింగ్ విలేజ్‌కు దగ్గర్లోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో తాత్కాలిక షెడ్డుల్లో ఉన్న వారికి హైడ్రా అధికారులు చెప్పారు. మీకు 10 రోజులు సమయం ఇస్తున్నాం.. ప్రత్యామ్నాయం చూసుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని సూచించారు. ఈమేరకు బుధవారం హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, హైడ్రా ఏసీపీ తిరుమల్, ఇరిగేషన్ శాఖ డీఈ రమాదేవితో పాటు.. పలువురు హైడ్రా అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకుని నివాసముంటున్న వారితో మాట్లాడారు.పేదలను, అమాయకులను అడ్డంపెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని కూడా హెచ్చరించారు. ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని 6 నెలలుగా హెచ్చరించినా పట్టని ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు..

చుట్టూ వేలాది నివాసాలు.. లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. చెరువును ఆక్రమించి నిర్మాణ వ్యర్థాలతో నింపేసి.. తాత్కాలిక షెడ్డులతో కబ్జా చేయాలనుకునే వారి కుట్రలను అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. చెరువు చెంతనే చెత్తను వేరు చేసే యూనిట్లకు అద్దెకు ఇచ్చి ముష్కిన్ చెరువును మురికి కూపంగా మార్చడాన్ని సీరియస్‌గా పరిగణించింది. బడాబాబుల కబ్జాలకు కార్మికులు, సామాన్యులు బలి కావద్దు.. అంటూ విజ్ఞప్తి చేసింది. హెచ్ఎండీఏ నిర్ధారించిన మేరకు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమదంటూ వాదిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు.. మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది. ఇక బఫర్‌జోన్ కలిపితే ముష్కి చెరువు 62 ఎకరాల వరకూ ఉంటుంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చేశారు. అయినా పట్టించుకోకుండా.. చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమౌతోంది. వరద నీరు రాకుండా కాలువలను మూసేసి నిర్మించిన ప్రహరీని అక్కడి స్థానికులు చూపించారు.

-వ్యసనంగా మారిన ఐపిఎల్ బెట్టింగ్
-ఈజీ మనీకోసం యువకులు ఆరాటం
-పందెంకోసం అప్పులు,బంగారం, బైకుల తాకట్టు
-చివరకు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న వైనం

హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త: క్రికెట్ ప్రేమికులకు వినోదాన్ని అందించే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) తోయువత పెడతోవ పడుతుంది. క్రికెట్ బెట్టింగులకు జేబులను గుల్ల చేసుకుంటున్నారు. ఈజీగా మనీ సంపాదనే ధ్యేయంగా బెట్టింగులకు అడుగులేస్తుంది. ఏటా మార్చి,ఏప్రిల్,మే లోజరిగే ఐపీఎల్‌తో ఎందరో యువకులు రోడ్డున పడి, ప్రాణాలు కోల్పోతున్నారు. క్రికెట్‌ను క్రీడలా చూడాల్సిన విద్యార్థులు యువత దీన్ని వ్యసనంగా మార్చుకుంటున్నారు. మ్యాచ్ జరిగే సమయంలో యువత చేతిలో డబ్బు లేకపోతే తల్లిదండ్రులు ప్రేమతో ఇచ్చిని ద్విచక్రవాహనాలు,సెల్‌ఫోన్‌లు బంగారు గొలుసులు తాకట్టు పెట్టి బెట్టింగ్ కాస్తున్నారు. ఎన్నో ఆశలతో కొన్ని జట్లుపై బెట్టింగ్‌కు దిగుతూ యువత చేతులు కాల్చుకుంటుంది. కాగాఈవ్యవహారమంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుండటంతో విషయం బయటకు పొక్కటం లేదు. ముఖ్యంగా ఈ వ్యవహారాన్ని అడ్డుకుందామని పోలీసులు ప్రయత్నించినా..చిన్నసాక్ష్యం కూడా దొరకడంలేదని చెప్పవచ్చు. వాట్సాప్‌లో షేరింగ్స్, ఆన్‌లైన్‌లో మనీట్రాన్స్ ఫర్,టాస్ దగ్గర్నుంచి బాల్,రన్, వికెట్...ఇలా ఒక్కోదానికి ఒక్కోరేటు.ఇక సిక్సులు, ఫోర్లకు వేలల్లోనే..ఇదీ ఆన్‌లైన్ అడ్డాగా సాగుతున్న క్రికెట్ మాఫియా బెట్టింగ్ దందా.నేషనల్ ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచులు జరిగే సమయంలో జోరుగా బెటి ంగ్ చేసే ఈముఠాలు తాజాగా ఐ పీఎల్ సీజన్‌లలో మరింత స్పీడు పెంచాయి. ఇప్పటికికే నగరంలో నాలుగు గ్యాంగ్స్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు...ఐపిఎల్‌పై గట్టినిఘా పెట్టారు.

రేటింగ్స్ ఆధారంగా బెట్టింగ్..

మ్యాచ్‌లో పాల్గొంటున్న జట్లకు రేటింగ్స్‌ను బలాబలాలను బుకీలు ఇస్తున్నారు. బలంగా ఉన్నజట్టుకు తక్కువ రేటింగ్, బలహీన జట్టుకు ఎక్కువ రేటింగ్ ఇస్తూ యువత జీవితాలతో ఆడ కుంటున్నారు. ఉదాహారణకు బంగ్లాదేశ్,ఆస్ట్రేలియా జట్లు ఆడుతున్నప్పుడు బంగ్లాదేశ్‌జట్టుకు 150రేటింగ్, ఆస్ట్రేలియాకు కేవలం 40రేటింగ్స్ ఇస్తున్నారు. లక్షరూపాయలు ఆస్ట్రేలియా వైపు బెట్టింగ్ కాస్తారు. ఆస్ట్రేలియా గెలిస్తే రూ.40 వేలు మాత్రమే వస్తాయి. ఓడిపోతే మాత్రం రూ.లక్షపోతుంది. ఇలా ఆయా జట్ల బలాబలా ఆధారంగా బుకీలు చలరేగిపోతున్నారు.

వ్యవహారమంతా ఆన్‌లైన్‌లోనే..

బెట్టింగ్ దందా అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. ఈవ్యవహారం ఇప్పుడు వాట్సాప్, హైక్, మేస్సెంజర్,టెలిగ్రామ్‌లను ఆధారంగా చేసుకుని నడుస్తుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఆయా జట్ల బలాబలాలపై బుకీలు రేటింగ్స్‌ను ఇస్తారు. ఈరేటింగ్స్‌పై బెటింగ్ కాసేందుకు బుకీలకు సంబంధించిన ఏజెంట్లు యువతకు విషయాన్ని చేరవేస్తారు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా..అప్పుగానో..వస్తువుల తాకట్టుపెట్టో డబ్బును బెటి ంగ్‌లో పెడుతున్నారు. ఈవ్యవహారంమంతా ఆన్‌లైన్‌లోనే నడుస్తుంది. ముఖ్యంగా గూగుల్‌పే ,ఫోన్‌పే,పేటిఎం తదితర యాప్‌ల నుంచి నగదును ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు.

వరదల నివారణ..రోడ్ల అభివృద్ధి

-అండర్‌పాస్ సుందరీకరణ.. మోడల్ స్మశాన వాటిక
-సిఎంసి స్టాండింగ్ కమిటీలో ఏడు అంశాలకు ఆమోదం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రత్యేక అధికారి జయేషన్‌రంజన్, సిఎంసి కమిషనర్ సృజన తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త: కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధి పరంగా, పౌర సేవల నిర్వహణ, పరిపాలన పరంగా తీసుకునే నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి)ప్రధాన కార్యాలయంలో జరిగింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన సిఎంసి స్థాయి సంఘం 3వ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగరంలోని కీలక మౌలిక సదుపాయాలు, పౌర అభివృద్ధి ప్రతిపాదనలను సమీక్షించి, ఆమోదం తెలిపారు. ఈసమావేశం ముందు ప్రవేశపెట్టిన ఏడు అంశాలతో కూడిన ఎజెండాలోని ఆరు అంశాలను ఆమోదించారు. వీటితో పాటు అదనంగా మరోక టేబుల్ ఐటమ్ ను కమిటీ ముందు ఉంచి ఆమోదం పొందారు. ఆమోదించిన ప్రతిపాదనలు కూకట్‌పల్లి జోన్, మూసాపేట సర్కిల్, వార్డు నం. 258 పరిధిలోని బాలానగర్ వద్ద ఫ్లైఓవర్ అండర్‌పాస్‌ను సుందరీకరించడం, స్పోర్ట్స్ ఏరియా అభివృద్ధి చేసేందుకు రూపకల్పన చేసిన రూ. 2.50 కోట్లకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మాదాపూర్ వార్డు నెంబర్ 232, బోరబండ సైట్03 వద్ద ఉన్న నాలా వెంబడి రిటైనింగ్ వాల్స్‌తో కూడిన బాక్స్ డ్రెయిన్ నిర్మించి, వరద నీటి సమస్యను పరిష్కరించడానికి, నీరు నిల్వ నివారణ చర్యల కోసం రూపొందించిన రూ. 2.99 కోట్ల ప్రతిపాదనకు కూడా కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కూకట్‌పల్లి జోన్, మూసాపేట సర్కిల్, ప్రశాంత్ నగర్ (వార్డు నం. 259)లో రూ.3 కోట్ల అంఛనా వ్యయంతో మోడల్ హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి ప్రతిపాదనకు సైతం కమిటీ ఆమోద ముద్ర వేసింది. గోపనపల్లి ఫ్లైఓవర్ నుండి వట్టినాగులపల్లి (ఖజాగూడ రోడ్డు) మీదుగా ఔటర్ సర్వీస్ రోడ్డు వరకు (శేరిలింగంపల్లి జోన్) రోడ్డు అభివృద్ధికి సుమారు రూ. 37 కోట్ల తో రూపొందించిన ప్రతిపాదనను కూడా కమిటీ ఆమోదించింది. దీంతో ఔటర్, అంతర్గత నగర ప్రాంతాల మధ్య మెరుగైన రవాణా అనుసంధానమవుతుందని అధికారుల భావిస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్పోర్ట్స్ వింగ్ పరిధిలోని క్రీడా సౌకర్యాల నిర్వహణను క్రమబద్ధీకరించడానికి యూజర్ ఛార్జీల సవరణ ప్రతిపాదనకు కూడా స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి తోడు క్రీడా పరిపాలనను బలోపేతం చేయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్పోర్ట్స్ కోటా ద్వారా అసిస్టెంట్ డైరెక్టర్ (స్పోర్ట్స్), గేమ్స్ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసే ప్రతిపాదనను కూడా కమిటీ ఆమోదించింది. అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సంబంధించి చెట్ల కొమ్మలను కత్తిరించడం, ప్రజల భద్రత కోసం వాహనాలకు అమర్చిన బకెట్ లాడర్ల వినియోగం కోసం రూ.5.70 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనకు కూడా కమిటీ ఆమోద ముద్ర వేసింది. దీంతో కార్పొరేషన్ పరిధిలోని అన్ని జోన్లలో 14 అదనపు వాహనాలను ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించినట్టయింది. ఆమోదించిన పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని స్థాయీ సంఘం స్పష్టం చేసింది.

వివిధ విభాగాల మధ్య సమన్వయంతో, నాణ్యతతో పనులు చేపట్టి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని అధికారులను ఆదేశించింది. అధికారులు పనులను వెంటనే అమలు చేయాలని కూడా స్టాండింగ్ కమిటీ అధికారులను ఆదేశించింది. సమావేశంలో కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, చీఫ్ ఇంజనీర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పట్ల బిఆర్ఎస్ నేతలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఇతర నేతలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఓటరు జాబితా సవరణ కోసం మే 1 నుండి నిర్వహించే ఇంటింటి సర్వే (ఎస్ఐఆర్) కార్యక్రమం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధుల సమావేశం బుధవారం సీతాఫలమండీలో జరిగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ మే 1వ తేదీ నుండి ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని అధికారులు ఇంటింటికీ వచ్చి కుటుంబ సభ్యుల వివరాలు ఓటరు జాబితాతో సరి చూసుకుంటారని తెలిపారు. ఇంటింటి సర్వేకు వచ్చే అధికారుల (తీలివీ) లతో సమన్వయం చేసుకునేందుకు గాను బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఏర్పాట్లు జరిపామని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో శ్రేణులు చురుకుగా పాల్గొనాలని పద్మారావు గౌడ్ సూచించారు. పార్టీ కి కష్టపడి పని చేసేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడి పని చేసిన కార్యకర్తల వల్లే నేతలు రాణిస్తారని, తమ జీవిత కాలం పాటు గుర్తుంచుకుంటామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నేత తీగుళ్ళ రామేశ్వర గౌడ్, మాజీ కార్పొరేటర్‌లతో పాటు బెజ్జంకి రాజేష్, పాకసాయి, శైలేందర్ గంగపుత్ర, మందజగన్, చింతకింది మల్లేష్, సచిన్, సీనియర్ మహిళా నేతలు బళ్లగీత, సుమలత, జి.లలిత ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



అత్తాపూర్ ఏప్రిల్ 29, ప్రభాతవార్త : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అధికారులు సూచించారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరంఘర్ లోని హోటళ్ల మరియు లాడ్జిలలో డీపీఓ స్వాతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష, పోలీస్ శాఖకు చెందిన ఎస్ఐ రాజ్‌కుమార్, సీఓ లక్ష్మణ్‌ల సంయు క్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా హోటల్ సిబ్బంది ఆధార్ కార్డులు మరియు వారి వివరాలను పరిశీలించారు. బాల కార్మిక వ్యవస్థ, చిన్నారుల అక్రమ రవాణా మరియు బాలలపై వేధింపుల నివారణపై హోటల్ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. చిన్నారుల రక్షణకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అను మానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమా చారం ఇవ్వాలని సూచించారు.చిన్నారుల భద్రత మరియు సంక్షేమం కోసం ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఆసుపత్రుల్లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలి

-సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

హైదరాబాద్,ఏప్రిల్ 29,ప్రభాతవార్త: జిల్లాలో పనిచేస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉండి వచ్చే వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు అందుతున్న సేవలు, వసతుల కల్పన, అంబులెన్ పనితీరు, ఖాళీలు, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, టీబి కేసుల వివరాలు, ఇమినైజేషన్ కార్యక్రమం అలాగే డాక్టర్స్ , సిబ్బంది వివరాలు ఆమె అడిగి తెలుసుకున్నారు. అసాధారణ ప్రసవాలు పెంచడం, అవసరం లేని సిజేరియన్ ప్రసవాలను తగ్గించడం, వైద్యులు విధి సమయంలో అందుబాటులో ఉండడం, రోగుల రాకపోకలు, దయాగ్నస్టిక్ సేవల వినియోగాన్ని పెంచడం పై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో ఉన్నటువంటి 15 క్లస్టర్ లలో వైద్యుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని అలాగే క్లస్టర్ యొక్క వివరాలు, ఆ ప్రాంత జనాభా వివరాలను అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ కాన్పులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సి సెక్షన్ ను తగ్గించాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ ఆస్పత్రుల డేటాను సేకరించాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. అలాగే 161 బస్తీ దవాఖానలలో పూర్తిస్థాయి మందులు, చికిత్స తో శాంపిల్స్ కూడా తప్పక తీసుకొని రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. పిల్లలకు ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా వ్యాక్సినేషన్ తప్పక ఇవ్వాలని , వివిధ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు మెరుగైన వైద్య చికిత్సలు అందాలని తెలిపారు.ఎఈ సమీక్ష సమావేశ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు , సిడిపిఓలు, కార్యాలయ పర్యవేక్షకులు , డిసిపి యూనిట్ పాల్గొన్నారు.

పాతబస్తీలో పర్యటించిన టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్



దేవిబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్

చార్మినార్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త : తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండి జితేష్ వి.పాటిల్ బుధవారం సాయంత్రం బహదూర్‌పుర సమీపంలోని దేవిబాగ్ విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ నర్సింహులు,మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు బిక్షపతి,సౌత్ జోన్ ఎస్ఈ శ్రీనివాస్,చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,లైన్స్ డిఈ దిలీప్, ఏడిఈలు మహ్మద్ అక్బర్,మక్సూద్,ఏఈ రాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రామాలయంలో మాజీ మంత్రి కెటిఆర్ ప్రత్యేక పూజలు



కూకట్పల్లి రామాలయంలో పూజలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలోని శ్రీ రామాలయం వద్ద 27 అడుగుల ఏకశిల శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల స్థాపన మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామ ప్రజలచే విగ్రహమూర్తులకు క్షీరాభిషేకం అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, దేవాలయము చైర్మన్ ఎన్. శ్రీనివాస్ రావు (చిన్న తులసి) నియోజక వర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, పగుడాల శిరీష బాబురావు, మహేశ్వరీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ 440 ఏళ్ల చరిత్ర గల ఈ కూకట్‌పల్లి రామాలయం వద్ద శ్రీ గరుడ, హనుమద్‌మూర్తుల స్థాపనతో కూకట్‌పల్లి దేదీప్యమానంగా వెలుగుతోందని, గ్రామస్తులు సహకారంతో ఈ కూకట్‌పల్లి రామాలయాన్ని పునర్నిర్మించుకుని ఆ సీతారామచంద్రులు ఆశీస్సులు పొందామని తెలిపారు. ప్రజలంతా కూడా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పల్లెలు పాడిపంటలతో కళకళలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు.

సమాజ దర్పణం పుస్తకావిష్కరణ

ప్రముఖ రచయిత పేరి నాగేశ్వర్ రావు రచించిన సమాజ దర్పణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగరాజ శర్మ

చిక్కడపల్లి ఏప్రిల్ 29 , ప్రభాతవార్త :

చిక్కడపల్లి త్యాగరాయణ గానసభలో శ్రీ ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇసాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, సమాజ సేవకుడు లయన్ పేరి నాగేశ్వరరావు రచించిన సమాజ దర్పణం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ పూర్వపు సీఎండీ ఎం. నాగరాజ శర్మ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అధ్యక్షత వహించిన త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధనమూర్తి మాట్లాడుతూ నాగేశ్వరరావు అతి తక్కువ కాలంలోనే రెండు అద్భుత గ్రంథాలను అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. రిటైర్డ్ ఐజీ ఆకుల నరసింహ, రిటైర్డ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పేరి కామేశ్వరరావు పాల్గొన్నారు. ఎనిమిది గంటల పాటు పెరి నాగేశ్వర్ రావు స్వరసారథ్యంలో ఆ పాట మధురాలుసంగీత విభావరి శ్రోతలను ఉర్రూతలూగించింది. 75 మందికి పైగా గాయనీ గాయకులు అలనాటి మధుర గీతాలను ఆలపించారు. నాగేశ్వరరావు-విజయలక్ష్మి, రవికుమార్-సవితశ్రీ దంపతులతో పాటు ప్రసన్న విజయ్ కుమార్, సౌమ్య, నీరజ, పి.వి. రమణమూర్తి, హరికృష్ణ తదితరుల గానం సభికులను అలరించింది.

మే 2 నుంచి 10వ తేదీ వరకు చిక్కడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :

హరినామ సంకీర్తన...గోవింద కీర్తనలతో వేకువనే వీధులు మారుమ్రోగుతుంటాయి. గంటానాధం, వేదమంత్రాలు గాలి తరంగాల మాటున చిక్కడపల్లి వీధివీధిని మేలుకొలుపుతాయి. తిరుమల తిరు క్షేత్రానికి సాక్షాత్తు ప్రతిబింభంలా నిలిచిన శ్రీ శ్రీనివాసుని కోవెల చిక్కడపల్లి ప్రాంత ప్రజలతో పాటు భాగ్యనగరానికి కొంగుబంగారమై కొలువుదీరింది. ఇక్కడున్న ఆది విష్ణువాంశ శ్రీనివాసుని పాదాలు తాకినంతనే పాపులు పునీతులై కష్టాలు కడతేరి భక్తులు అష్టఅయిశ్వర్యాలు పొందుతారని ప్రతీతి ఉన్నది. సుమారు 76 ఏళ్ళ క్రితం శ్రీనివాసపురం(చిక్కడపల్లి)లో గుడిదేవుని వంశీకుడైన జంగయ్యగౌడ్ నిర్మించిన ఈ ఆలయం నేటికి అద్భుత శిల్పాకళా సంపదను చూపరులను ఆకర్షిస్తున్నది. గుడిదేవుని జంగయ్య గౌడ్ పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా వేదవిధి పూర్వకంగా నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణోత్తములచేత స్వామివారి శిలామూర్తులను ప్రతిష్ఠింపచేశారు. ఆనాటి నుంచి నేటి వరకు పిలిస్తే పలికే దైవంగా నిలిచిన శ్రీనివాసుని సేవించనివారు శ్రీనివాసపురం పరిసరాల్లో లేరంటే అతిశయోక్తికాదు. వైష్ణవ సాంప్రదాయాన్ని పరిరక్షిస్తున్న ఈ ఆలయం, బ్రాహ్మణోత్తములకు వేదికగా నిలిచింది. జాతకర్మ నుంచి మహాయాగాల వరకు దేన్నైనా అలవోకగా అనుపాతం చేసే బ్రాహ్మణులు ఇక్కడ అందుబాటులో ఉండడం వల్ల నగరానికి చిక్కడపల్లి చిన్న తిరుపతిగా నిలిచింది. వైష్ణవ సాంప్రదాయాలకు అనుగుణంగా వచ్చే ప్రతి పర్వదినాన ఆలయానికి భక్తులు తండోపతండాలుగా రావడం ఇక్కడి విశేషం. స్వామి వారి మహత్యానికి ఇది చిరు నిదర్శనం మాత్రమేనని స్థానికులు పేర్కొంటారు. 1981 నుంచి దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్న ఆలయంలో హిందూ ధర్మశాస్త్రాలకు అనుగుణంగా భక్తులకు ప్రసాద వితరణ జరుగుతోంది. రాష్ట్రంలోని మహోన్నత ఆలయాలలో జరిగే విశిష్ట ఆచార వ్యవహారాలను ఇక్కడ యధాతథంగా వేదపండితుల పర్యవేక్షణలో జరుగుతోంది. జరుగుతుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలివీ

మే 2వతేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, అసిస్టెంట్ కమీషనర్ , కార్యనిర్వహణాధికారి వి.అంబుజ వివరించారు. 2న సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, రాత్రి 8 గంటలకు మహానివేదన, మంత్రపుష్పం, 3న ఉదయం పతాధివాసము, హవనము, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము, రాత్రి శేషవాహనసేవ ఉంటుంది. 4న పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ, 5న ఉదయం పదిన్నరకు పల్లకీసేవ, రాత్రి గజవాహనసేవ,6న పల్లకీసేవ అనంతరం స్వామివారికి ఎదురుకోళ్లు అనంతరం కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 7న పల్లకీసేవ, గరుఢవాహన వాహన సేవ, 8న రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవం, 9న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. 10న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వస్వామి అలయ ముఖధ్వారము

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

అబ్బురపరిచిన చిన్నారుల నృత్యకుసుమాలు

గురు శిష్యులను సన్మానిస్తున్న జానకి తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :

ప్రముఖ సాంస్కృతిక సంస్థ కనకదుర్గా నృత్యవిభావరి ,హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రముఖ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని సంస్థ చిన్నారి కళాకారులు సుప్రసిద్ధ భరతనాట్య గురు నిర్మల ప్రభాకర్ నేతృత్వంలో నృత్యకుసుమలు శీర్షికన ప్రదర్శించిన భరతనాట్యం ఆహుతులను అబ్బురపరిచి అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు సహస్ర, సంహిత, జయనీ, సతాక్షీ, పూర్వీ, కృతిక, వాసవి, రిత్విక తదితరులు అద్భుతంగా ప్రదర్శించిన వినాయకస్తుతి, జతిస్వరం, హరిగిరి నందిని, దుర్గాష్టకం, అన్నమాచార్య, త్యాగరాయస్వామి కీర్తనలు, లింగాష్టకం నృత్యాంశాలు ప్రేక్షకులను తన్మయుల్ని చేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక పాఠశాల ప్రిన్సిపాల్, కల్చరల్‌వింగ్ కోఆర్డినేటర్ జానకి గురువు నిర్మలాప్రభాకర్‌ను ఘనంగా సత్కరించి చిన్నారికళాకారులకు శుభాశీస్సులందజేశారు.

చదువుతోపాటు కళల్ని ప్రోత్సహించాలి : సినీ రచయిత శ్రీరామ్ చౌదరి

చిక్కడపల్లి ఏప్రిల్ 29 , ప్రభాతవార్త : చదువుతోపాటు కళల్ని ప్రోత్సహించాలని సినీ రచయిత శ్రీరామ్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నృత్య ప్రదర్శనలు, కళారత్న అవార్డు ప్రదానం, సమ్మర్ సంగీతోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడిది సుబ్బయ్య ట్రస్టు ఫౌండర్ డాక్టర్ మేడిది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంగీతానికి స్పందించని వారు ఉండరు. సంగీతం అనేది మనుషులు ప్రకటించే గొప్ప అంశం. సంగీతానికిని జాతి, కుల, మత, వర్గ, ప్రాంత, దేశ బేధాలు లేకుండా మనుషుల్ని కలిపే శక్తి ఉంటుందన్నారు. కళారత్న అవార్డు గ్రహీతలు డాక్టర్ పి.నారాయణ మూర్తి (హైదరాబాద్), రంగస్థల స్వర బ్రహ్మ జి.రామకృష్ణ (నెల్లూరు), బి.గిరిజలక్ష్మి (సూళ్లూరుపేట), నాట్య మయూరి అపర్ణ (నెల్లూరు) , పందిటి సుబ్బయ్య (నెల్లూరు), ఎం.వి.ఎన్.ఎస్.దుర్గ (తిరుపతి), సి.హెచ్.రాజా దాసు (డక్కిలి), నాయబ్ రసూల్ (నెల్లూరు), కె.మస్తానయ్య (చౌటపాలెం) తుమ్మల సీతారామయ్య (యల్లంటి) లను శాలువా, మెడల్, మొమెంటో, ప్రశంసాపత్రం, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో కర్నాటి ఆంజనేయరెడ్డి, డాక్టర్ కె.బాబు అగస్టస్, డాక్టర్ షేక్ ఇంతియాజ్, లక్ష్మీ నారాయణ, బూదాటి రాధాకృష్ణయ్య, మిరియాల వెంకట రమణయ్య, ఎ.ఎం.రత్నం, యనమల నాగేశ్వరరావు, ఎస్.వి.రమేష్ బాబు, షేక్ రియాజ్ బాషా, షేక్ పర్వీన్, అందే శ్రీనివాసులు, బిట్టు సరస్వతి, బలరామాయ్య నాయుడు, మురళీమోహన్ రాజు, చీదరాల చెన్నయ్య, రవి గోగులపల్లి, శ్రీకర్ రెడ్డి, వివిధ జిల్లాల నృత్య కళాకారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కళారత్న అవార్డు ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి కొత్త ఎసిపిగా రణవీర్ రెడ్డి

..రమేష్ కుమార్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం

చిక్కడపల్లి ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్‌గా జి. రణవీర్ రెడ్డి ని నియమిస్తూ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ లో ఏసీపీగా పనిచేస్తున్న జి. రణవీర్ రెడ్డిని చిక్కడపల్లి ఏసీపీగా బదిలీ చేశారు. ఇప్పటివరకు చిక్కడపల్లి ఏసీపీగా విధులు నిర్వహించిన ఎల్. రమేష్ కుమార్ బదిలీ అయ్యారు. రమేష్ కుమార్ వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వు ల్లో పేర్కొన్నారు. 1991 బ్యాచ్ కు చెందిన రణవీర్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ గా హైదరా బాద్ నగరంలోనే ట్రాఫిక్ తో పాటు వివిధ ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ లలో పని చేసారు. ఇన్స్పెక్టర్ గా మంగళహాట్, ఇంటెలిజెన్స్ చాలాకాలం పని చేసారు. ఏసీపీ గా పదోన్నతి పై సెంట్రల్ క్రైమ్ స్టేషన్, మాదాపూర్, పిటిసి అంబర్ పెట్, స్పెషల్ బ్రాంచ్‌లో సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం చిక్కడపల్లి ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్బంగా రణవీర్ రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బాధితులకు ఎలాంటి సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరించడానికి శాయాశక్తులా ప్రయత్నిస్తానన్నారు. ఎటువంటి సమస్యలున్నా వాటి పరిష్కారం కకోసం నేరుగా కలువవచ్చని, ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణాన్ని గాంధీనగర్ చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్, కాచిగూడ పోలీసుస్టేషన్ల పరిధిలో మరింత ధృడం చేస్తానన్నారు. డివిజన్‌లో నేరాల అదుపునకు మూడు పోలీసుస్టేషన్ల పరిధిలో నిఘాను మరింత పెంచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తానన్నారు. అసాంఘిక శక్తులపైన పోలీసులు ఉక్కుపాదం మోపుతానన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత వేగవంతంగా కృషి చేస్తానని అన్నారు. ఈ రకంగా ప్రజలందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత మెరుగ్గా పనిచేస్తానన్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని అన్నారు.

బతుకమ్మకుంట పేరుతో కోట్ల ప్రజాధనం వృధా

-కాంగ్రెస్‌నేతల కళ్లలో ఆనందం చూసేందుకే హైడ్రా చర్యలు
-బిఆర్ఎస్ అంబర్‌పేట్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:

హైడ్రా అవగాహన రహిత్యం, కొంత మంది కాంగ్రెస్ నేతలను సంతృప్తి పరిచేందుకు బతుకమ్మకుంట అభివృద్ధి పేరిట కోట్ల రూపాయాల ప్రజాధనం వృదా చేశారని బిఆర్ఎస్ ఆంబర్‌పేట్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కోర్టు స్టేటస్ కో కోనసాగుతున్నప్పుడు అధికారుల దూకుడు చర్యలతో బతుకమ్మకుంట అభివృద్ది కోసం రూ.8 కోట్లు ఖర్చు చేయడం దారుణమన్నారు. బతుకమ్మకుంట అభివృద్ధి ఆనావాళ్లు లేకుండా యాదాస్థితి కోనసాగించాలని సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడం ప్రభుత్వానికి చెంపపెట్టని ఆయన అన్నారు. బుధవారం ఛేనంబరు చౌరస్తాలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతారావును కళ్లలో ఆనందం చూసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మకుంటపై హైడ్రాను ఉసికొల్పారని ఎద్దేవ చేశారు. విహెచ్ అవగాహన రహిత్యంతో అందరిని తప్పుదోవ పట్టిస్తున్న విషయాన్ని అధికారులు పసిగట్టకుండా తొందరపడటంతో వారికి కోర్టు నుంచి మొట్టికాయలు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.బతుకమ్మకుంటపై చేసిన వృదా ఖర్చును కాగ్ సంస్థ ఎత్తి చూపి బాధులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తప్పుడు చర్యలు బీజేపీ సైతం మద్దతూ తెలిపి వారు చేసిన ధర్నాలో పాలుపంచుకోవడం హాస్యాస్పదమన్నారు. అలాగే బతుకమ్మకుంటలో సిపిఎం నేత చేసిన అక్రమలను పట్టించుకోకుండా వారిని ధర్నాలో భాగస్వాములు చేయడం దివాలకోరుతానానికి నిదర్శనమన్నారు. బతుకమ్మకుంటపై అంతాత్తైన ఆర్పాట ప్రచారం చేసిన వారు ఇప్పుడు కోర్టు తీర్పుతో ప్రజలకు ఏం సమాధానం చెపుతారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ పుట్టక ముందు తాను బతుకమ్మకుంట స్థలాన్ని తీసుకున్నాని, పార్టీకి సొంత వ్యాపారానికి ఏలాంటి సబంధం లేదన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటికైన అవగాహన రహిత్యంతో వ్యవహరించవద్దని ఆయన హితవు పలికారు. బతుకమ్మకుంటపై చేసిన ప్రజాధనాన్ని బాధ్యుల నుంచి రికవరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

విద్యుత్ షాక్‌కు గురైన లైన్‌మాన్

తీవ్రగాయాలతో వైద్యశాలలో చికిత్స..పరిస్థితి విషమం..?

దుండిగల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు చేస్తుండగా ఓ లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలైన లైన్‌మెన్‌ను చికిత్స కోసం వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే జీడిమెట్ల డివిజన్, దొమ్మరపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాగబాబు అనే వ్యక్తి లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని అరుంధతి వైద్యశాల సమీపంలో ఉన్నటువంటి ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు తలెత్తినట్లు సమాచారం అందుకున్న లైన్‌మెన్ నాగబాబు అక్కడ్ చేరుకున్నాడు. విద్యుత్ లైన్లను పరిశీలించిన ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌పైన సమస్య ఉన్నట్లు గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి సమస్యను పరిష్కరిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఈప్రమాదంలో నాగబాబు ఒంటిపై తీవ్రగాయాలై పైనుండి పడిపోయాడు. గమనించిన సహ సిబ్బంది హుటాహుటిన చికిత్స కోసం సుచిత్రలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషమ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తుంది. కాగా గత 15 రోజుల కిందట ఇదే జీడిమెట్ల డివిజన్ పరిధి బహదూర్‌పల్లిలో సైతం లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ మరణించారు. ఆ సంఘటన మరువక ముందే అదే తరహాలో మరో ఘటన చోటు చోసుకోవడంతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఘటనలకు సంబంధించి పూర్తి స్థాయి సమాచారం ఇవ్వడంలో విద్యుత్ అధికారులు విముఖతను చూపడంతో స్థానికంగా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి వలనే కిందిస్థాయి సిబ్బంది ప్రాణాల మీదకు వస్తున్నట్లు పలువురు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఈ రెండు ఘటనలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీహెచ్ఎంసి చార్మినార్ జెడ్‌సిగా సత్యనారాయణ బాధ్యతలు

చార్మినార్ జోనల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :

మహానగరపాలక సంస్థ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్‌గా కె.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసి ప్రధాన కార్యక్రమంలో అదనపు కమిషనర్ (అడ్మిన్/లీగల్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.సత్యనారాయణను ప్రస్తుత జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో నియమించారు. దీంతో ఆయన నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి నుండి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన జెడ్సి సత్యనారాయణ మాట్లాడుతూ జోన్‌లోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మూసారాంబాగ్ సర్కిళ్ళలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు నూతన జెడ్సిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పది ఫలితాలలో సత్తా చాటిన నార్సింగి గురుకుల విద్యార్థినులు

- గండిపేట మండల టాపర్‌గా నిలిచిన శ్రీలేఖ
- 100.శాతం ఫలితాలు సాధించిన గురుకుల, కేజీబివి పాఠశాల విద్యార్థులు

నార్సింగి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :

పదో తరగతి ఫలితాలలో నార్సింగిలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ పాఠశాలకు చెందిన 7.గురు విద్యార్థులు 600.కు గాను 550.కి పైగా మార్కులు సాధించి ఔరా అనిపించుకున్నారు. 500-550 మధ్యలో 33, 450-500లోపు 27, 400-450లోపు 09, 350-400.లోపు 03.విద్యార్థులు ఉత్తీర్ణతను పొందారు. ఇందులో ఎస్.శ్రీలేఖ 579, వైష్ణవి 569, మౌనిక 568, హర్షిణి 565.మార్కులు సాధించి పాఠశాల అధ్యాపకగణంతో శభాష్ అనిపించుకున్నారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థానంకు చేరుకోవాలని అధ్యాపకులు ఆశీర్వదించారు. గండిపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి మొత్తం 739.మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 568.మంది ఉత్తీర్ణత సాధించారు. 161.మంది ఫేయిల్ అయ్యారు. నార్సింగి గురుకుల పాఠశాల విద్యార్థులు 100.శాతం ఫలితాలు సాధించారు. నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 72.శాతం, వట్టినాగులపల్లిలో 75.శాతం, మణికొండలో 79.శాతం, హైదర్షాకోట్‌లో 64.శాతం, కిస్మత్‌పూర్ కేజీబివిలో 100, కోకాపేట్‌లో 80.శాతం ఫలితాలు వచ్చాయి. 579.మార్కులు సాధించిన శ్రీలేఖ గండిపేట మండల టాపర్‌గా నిలిచింది. 547.మార్కులతో స్నేహ ద్వితీయ స్థానంలో నిలిచింది. టాపర్లను పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో 100.శాతం ఉత్తీర్ణత సాధించారు. 50.మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50.మంది పాస్ అయ్యారు. ఇందులో దివ్యాక్షి ప్రథమ స్థానంలో, పార్థసారథి రెండో స్థానంలో నేహారెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన టాపర్లను, ఉత్తీర్ణత పొందిన విద్యార్థులందరిని పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి అభివనందించి, ఆశీర్వదించారు.

ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న నేతలు

కుల్కచర్ల,ఏప్రిల్,29 ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు.మండల పరిధిలోని కుసుమసముద్రం గ్రామంలో వర్ణిక సత్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని బుధవారం గృహ ప్రవేశం నిర్వహించారు.ఈ గృహప్రవేశాలకు స్థానిక నాయకుతలో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహప్రవేశంచేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్య, వెంకటయ్య గౌడ్, మాజి ఎంపిటిసి లక్ష్మయ్య, బాబు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,

చార్మినార్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త :

పాతబస్తీ కుడా స్టేడియంలో గురువారం సాయంత్రం చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్స్(2026) ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ యువత,విద్యార్థులు సమ్మర్ కోచింగ్,క్యాంప్స్‌లను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నిత్యం క్రీడలు ఆడటం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ,స్పోర్ట్స్ ,జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

మరమ్మతు పనులు చేపట్టాలని డిసికి వినతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29, ప్రభాత వార్త: పోచారం డివిజన్ పరిధి యంనంపేట్‌లో మిషన్ భగీరథ నీరు పైపులైన్ లీకేజీ అయి గత మూడు నెలలుగా వృథాగా రోడ్డు ప్రవహిస్తుందని తక్షణమే పైపులైన్‌కు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి కొరత జనాలను వేధిస్తుండగా మరోవైపు మిషన్ భగీరథ పైపులైన్ పగిలి వృథాగా నీళ్ల పోతున్నాయని దీంతో రోడ్డు బురదమయంగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ప్రజాసమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల ఆధారంగా వెంటనే చర్యలు చేపడుతామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన హామీఇచ్చారు. బుధవారం జీడిమెట్ల సర్కిల్ గణేష్‌నగర్ డివిజన్ పాపయ్యయావ్‌నగర్ రెయిన్‌బో హైస్కూల్లో ఆమె వివిధ విభాగాల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీలలోని మౌళిక సదుపాయాలైన రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలపై సంక్షేమ సంఘాల ప్రతినిధులను అడిగి వివరాలను రాబట్టారు. ఆయా కాలనీలలోని సమస్యలు, మౌళిక సదుపాయాలు, ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకున్నారు. గత కొంతకాలంగా సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఇస్తున్న ఫిర్యాదుల పరిష్కారంతోపాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించి చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరిచారు. పద్మానగర్ ఫేజ్ ఒకటిలో నీటిఎద్దడితో సతమతమవుతున్నట్లు సంక్షేమసంఘ వర్కింగ్ ప్రసిడెంట్ ఒక్కంటి దయాకర్ సిఎంసి కమిషనర్ శ్రీజన దృష్టికి తెచ్చారు. నీటిఎద్దడి పరిష్కారంకోసం తాము గతకొంత కాలంగా మంజీరా వాటర్‌బోర్డు కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించినట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మెట్రోవాటర్‌వర్క్స్ ఎండి అశోక్‌రెడ్డితో చర్చించి పద్మానగర్ ఫేస్‌ఒకటిలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఒక్కంటి దయాకర్ విజ్ఞప్తి చేశారు. పద్మానగర్ ఫేజ్ఒకటి సంక్షేమ సంఘ ప్రధానకార్యదర్శి దేవేందర్‌రెడ్డి, సత్యం, ప్రసాద్‌లతోపాటు రామిరెడ్డినగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు గల్వా యాదవరెడ్డి, ఇంద్రసింగ్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు భూషణంలతోపాటు ఎన్‌టిఆర్‌నగర్, దిల్‌ఖుష్‌నగర్ తదితర కాలనీలు, బస్తీల నుండి సంక్షేమసంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తమతమ సమస్యలను సిఎంసి కమిషర్ శ్రీజన దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. సమావేశంలో వెంకటేశ్వరనగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు నాగదీప్‌గౌడ్, ఎన్‌టిఆర్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు బాస్కర్ లతోపాటు వివిధ సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొని తమతమ సమస్యలను ఏకరువుపెట్టారు.

జీడిమెట్ల సర్కిల్ గణేష్‌నగర్ డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగితెలుసుకుంటున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, బిజెపి నాయకులు ఒక్కంటి దయాకర్ తదితరులు

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

అత్తాపూర్ ఏప్రిల్ 29, ప్రభాతవార్త :



వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు ఐహెచ్‌సిఎల్ కంపెని గగన్‌పహాడ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో జింజర్ హోటల్‌ను ప్రారంభించారు.ఐహెచ్‌సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపికా రావు , నిమంత్రన్ క్యాటరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ జడేజా మాట్లాడుతూ.. "ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్నాలజీ, మాన్యు ఫ్యాక్చరింగ్, మెడికల్ టూరిజం, విద్య రంగాలతో పాటుగా ఒక సుస్థిరమైన సాంస్కృతిక గమ్య స్థానంగా కూడా వినియోగదారులను కలిగి ఉన్న హైదరాబాద్‌లో విభిన్నమైన డిమాండ్‌ను అందుకోవడానికి వ్యూహాత్మకంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయబడిందని అన్నారు. సమావేశాలు, సదస్సులు, సామాజిక కార్యక్రమాలకు అనువుగా విశాలమైన బాంకెట్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

దుద్యాల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ లాలప్ప ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన గ్రామపంచాయతీ భవనం స్థానంలో 30 లక్షలతో పత్యేక నిధులతో గ్రామపంచాయతీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం ఇన్చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నా యన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, నాయకులు రఘుపతి, యాదవ రెడ్డి, జనార్ధన్ గౌడ్, హనుమంతు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 29. ప్రభాతవార్త: రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే పంటకు తగిన ధరతో రైతులకు లాభం చేకూరుతుందని మర్పల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ వై. మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో నాఫెడ్ టీజీ మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ నందు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పండించిన మొక్కజొన్నలు దళారుల వద్ద మోసపోకుండా నేరుగా మార్కెట్ కమిటీలో విక్రయించినచో పంటకు తగిన గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు 2400, రూపాయల మద్దతు ధర ప్రకటించిందని కనుక రైతు తమ పట్టాదారు పాసు పుస్తకము జిరాక్స్, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకము జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఏఈఓ లేదా ఆర్ఎస్ఎస్ ఆన్‌లైన్ లో ఉన్న రైతు ధృవీకరణ పత్రం సమర్పించి తమ పంటలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా విక్రయించుకోవాలని తెలిపారు. రైతు తమ పంట నాణ్యత కలిగి ఉన్నచో ఖచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు, తూకంలో కూడా ఎలాంటి మోసాలకు తావు లేకుండా అమ్ముకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మాధవి పీఏసి అధారి, నాగార్జున డీసీఓ, చెంద్రయ్య ఆడిట్ అధికారి, మండల రెవెన్యూ తహసిల్దారు రవిందర్, టీజీ మార్క్‌ఫెడ్ ప్రతినిధులు, సీనియర్ నాయకులు చెంద్రయ్య, గిరిసింగ్, ఎరాజ్ పాషా, మహిపాల్, సత్యనారాయణగౌడ్, బుచ్చయ్య, సహకార బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి, సీఈఓ శేఖర్, సిబ్బంది బాలయ్య, రవి, రమేష్, సందీప్ కుమార్, శివకుమార్, రాజు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాట సారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరం : ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్,కాంగ్రెస్ నేత శ్యామ్ సన్ రాజు

కంటోన్మెంట్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఎండ తీవ్రతతో రహదారులపై వెళ్లే బాటసారులు,ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం 2వ వార్డు రసూల్ పురాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రేటర్ కాంగ్రెస్ నేత శ్యామ్ సన్ రాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలు ముందుండి అండగా నిలువాలన్నారు. ప్రజా సేవా కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్తీ బాటలో ఎమ్మెల్యే . . .

నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ 2వ వార్డు రసూల్ పుర,బీరప్ప దేవాలయం, మార్కేండేయ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : తలసాని

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,ఏప్రిల్ 29 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బొలక్ పుర్ ప్రాంతానికి చెందిన కె.భాస్కర్ రావ్ గత కొన్ని రోజుల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు మంజూరైన 2.75 లక్షల రూపాయల ఎల్.ఓసీని బాధితుడి కుమారుడు సాయి ప్రశాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమగ్ర అభివృద్ధి కోసం వీజెన్‌సిస్ నూతన కార్యవర్గం

వి.జెన్‌సిస్ నూతన కార్యవర్గం.

బేగంపేట ఏప్రిల్ 29,ప్రభాతవార్త

ఆర్యవైశ్యుల సమగ్ర అభివృద్ధి కోసం స్థాపించిన వీజెన్‌సిస్ నూతన కార్యవర్గం ఎంపిక సికింద్రాబాద్ పరిధిలో జరిగింది.బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వరరావు,గౌరవ అతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తాలు హాజరయ్యారు.ప్రత్యేక అతిధులుగా ఆర్యవైశ్య సంఘం నాయకులు పసుని శ్రీనివాస్,అద్రి లక్ష్మీనారాయణగుప్తా,కటకం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వ్యవస్థాపక అధ్యక్షుడు వంశీ శంకర్ కొర్లిపర,కార్యదర్శిగా విశ్వేశ్వర్ సూరా,కోశాధికారిగా గోపీకృష్ణ పెంసాని ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తమ వం తు కృషి చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా హిమాయత్ నగర్ టీటీడీ దేవస్థానంలో ప్రతి రోజు జరుగుతున్న అన్నదాన కా ర్యక్రమానికి తమ వంతు మద్దతుగా వంట గది కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఒండు పరిసకాలను వారు సంస్థ తరుపున అందజేసారు.వారిని పలువురు అభినందించారు.

ఓటర్ జాబితా సమగ్ర సర్వేపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

ఓటర్ జాబితా సమగ్ర సర్వేపై సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త: మే 1 నుంచి ఎన్నికల కమీషన్ చేపట్టనున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్.) కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,నాయకులు అప్రమత్తంగా ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. బుధవారం తుకారాగేట్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఎస్ఐ.ఆర్)పై ఉన్న కొన్ని అపోహలు ఉన్నందునా కార్యకర్తలు, బూత్ ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు తమ ఇండ్ల వద్దకు సర్వేకు వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. నిజమైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్ సన్ రాజు, సదానంద్, బల్వంత్‌రెడ్డి, జమీల్, బాల్‌రాజు, సునీల్,హరిక్రిష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రహిల్స్ గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలు

ప్రిన్సిపాల్ శీలం సునీత

కంటోన్మెంట్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:

సికింద్రాబాద్ మ హేంద్రహిల్స్‌లో సాం ఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదివిన 10వ తరగతి ఎస్ఎస్‌సీలో 10 శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ శీలం సునీత తెలిపారు. మహేంద్రహిల్స్‌లోని గురుకుల పాఠశాలలో 79 మం ది పరీక్షలకు హాజరు కాగా 79 మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపా రు. 600కు 580 ఎం.ప్రవీనకు, జాహ్నవి 575, వి.నయోవి 569, కె.శ్వేత 551, సి.హెచ్.శిరీష 550 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. 100 శాతం ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు, వారికి తోడ్పడిన ఉపాధ్యాయులను,కళాశాల ప్రిన్సిపాల్‌ను హైదాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ సునీత అభినందించారు.

ఫ్లెమింగ్ లేబరేటరీస్‌లో ఐఎన్టీయూసీ జెండా ఆవిష్కరణ

నిజాంపేట్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

గుమ్మడిదల మండలంలోని ఫ్లెమింగ్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ కార్మికుల ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, కార్మిక సంఘం అధ్యక్షులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటానని తెలిపారు. కార్మికులు చేస్తున్న శ్రమకు తగిన వేతనం అందేలా కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అలాగే నూతన వేతన సవరణ, బోనస్, ఇతర బకాయిల విషయంలో కూడా యాజమాన్యంతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఆయన, అనంతరం

జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీశైలం గౌడ్

కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫ్లెమింగ్ లేబరేటరీస్ కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ ఎస్వీ సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్, కోశాధికారి లక్ష్మణ్, మైసయ్య, వెంకన్న, రాము, నరసయ్యతో పాటు సంఘ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలతో తెలంగాణ ప్రజాకళ వైభవం

రవీంద్రభారతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజా కళ శీర్షికన జరుగుతున్న 99 రోజుల ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదిక నిర్విరామంగా సాగుతున్న వివిధ తెలంగాణ కళా సాంస్కృతికోతసవాల్లో నాటకాల ప్రదర్శనలు ఆహుతులను ఆలోచింపజేస్తున్నాయి. బుధవారం రాత్రి వి.వి.అప్పలాచార్య రచన, డా. బక్కా శ్రీనివాసరావు దర్శకత్వంలో పంపన వెంకటేశ్వరరావు నిర్వహణలో శ్రీ గణపతి మహాత్యం; కందనూరు కళాసేవాసమితి, నాగర్‌కర్నూల్ వారి నిర్వమణలో బల్లేపల్లి లక్ష్మీకాంత కవి రచన, ఆర్.సత్యం దర్శకత్వంలో రూపొందిన సత్యహరిశ్చంద్ర – వారణాసి ఘట్టం అద్భుతంగా ప్రదర్శింపబడ్డాయి. నాటకాలకు ముందు ప్రభుత్వ శ్రీభక్తరామదాసు సంగీత నృత్యకళాశాల సికిందరాబాద్ సిరిపెల్లి నాగేశ్వరరావు శిష్యబృందంచే మృదంగ లయ విన్యాసం హోరెత్తించింది. వ్యాఖ్యాత విద్యానందచారి తనదైన ప్రత్యేకశైలిలో కార్యక్రమాన్ని సమన్వయపరుస్తూ ఆహ్లాదకరంగా ముందుకుసాగించి వీక్షకుల ప్రశంసలందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

చిరకాలం గుర్తుండే తెలిదేవర చెల్నేదో బాలకిషన్ : డా. ఏనుగు నరసింహారెడ్డి

తెలంగాణ భాషను సాహిత్యంలో అద్భుతంగా స్థిరపరిచిన సుప్రసిద్ధ రచయిత, సీనియర్ పాత్రికేయుడు తెలిదేవర భానుమూర్తి మృతి అటు సాహిత్యలోకానికి ఇటు జర్నలిజం రంగానికి తీరనిలోటని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. భువనగిరిలో పుట్టి పెరిగి హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకుని దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని యాసలను ఉదయం జాతీయ దిన పత్రికలో తన చెల్నేదో బాలకిషన్ అనే ప్రత్యేక శీర్షిక ద్వారా పట్టంకట్టిన అరుదైన స్నేహశీలి, సహృదయుడు ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నిజాంపేట్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిజాంపేట సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొని బుధవారం రాజీవ్ గృహ కల్ప, నిజాంపేటకు చెందిన పల్లపోల శ్రావణికి రెండు లక్షల ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల అత్యవసర వైద్య అవసరాలు, కుటుంబ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అవసర సమయంలో అందే ఈ సహాయం అనేక కుటుంబాలకు తోడ్పడుతూ వారి జీవనోపాధిని స్థిరపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అలాగే లబ్ధిదారులు త్వరగా కోలుకొని మళ్లీ సాధారణ జీవన విధానంలోకి రావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటికే అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అర్హులైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

బాధిత ప్రజలే మొదటి లబ్ధిదారులు కావాలి

పీపుల్స్ కమిటీ ఫర్ మూసీ రివర్ రెజువెనేషన్ నేతల డిమాండ్

సత్యాగ్రహ దీక్ష చేపట్టిన పీపుల్స్ కమిటీ ఫర్ మూసీ రివర్ రెజువెనేషన్ నేతలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: మూసీ పునరుజ్జీవనంలో బాధిత ప్రజలే మొదటి లబ్ధి దారులు కావాలని పీపుల్స్ కమిటీ ఫర్ మూసీ రివర్ రెజువెనేషన్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అడ్వకేట్ డాక్టర్ లుబ్నా సర్వత్, సయ్యద్ రఫీ, ప్రొఫెసర్ వెంకటదాస్‌ల ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమమనుద్దేసించి వారు మాట్లాడుతూ మూసీ నది చుట్టూ రాతి కట్టడాలు వద్దని, ప్రకృతి సహజంగా మూసీ ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు. పునదుజ్జీవన ఉపసంఘం సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గతంలో విజ్ఞప్తి చేశామని, దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మూసీ నది నీరు మరియు పూడికపై సవివరమైన నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బౌరంపేట్ స్నేక్ పార్క్ ప్రాంతం పరిశీలన.. వాకింగ్ ట్రాక్‌కు హామీ

దుండిగల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్‌లో ఉన్న స్నేక్ పార్క్ స్థలాన్ని జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ప్రజలకు వాకింగ్ ట్రాక్ అవసరమని ఇటీవల బౌరంపేట్ బీఆర్ఎస్ నాయకులు ఫారెస్ట్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ మేరకు ఎమ్మెల్యే సిఫారసు లేఖను కూడా అందజేయగా, ఎమ్మెల్సీ ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు, త్వరలోనే చర్యలు చేపట్టి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బౌరంపేట్ ప్యాక్స్ ఛైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఫారెస్ట్ శాఖ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మూసాపేట ఉప కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

కమిషనర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయములో మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన ఆంజనేయులును కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు, భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా భరత్ నగర్ కాలనీ స్థానిక సమస్యలు అంతర్గత రోడ్లు, శానిటేషన్, దోమలు, పార్క్‌లో ఉన్న ఓపెన్ జిమ్ మరమత్తుల గురించి కాలని వాసి జగదీష్‌తో కలసి ఉప కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. భరత్‌నగర్ కాలని 1978లో అనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము నాటి ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి అనేక మంది పేద మధ్య తరగతి ప్రజల సౌకర్య కోసం సుమారు 1900 వేల ఇల్లు అలాగే ప్రైవేటు హౌసెస్‌తో పాటు మహేశ్వరి నగర్, శక్తి నగర్ కాలనీ, జేపీ నగర్, ఎస్పీ నగర్ వంటి అనుబంధ బస్తీలు ఏర్పాటు అయ్యాయని చెప్పారు. స్థానికంగా ఇరుకు రోడ్లు వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వీలైతే ఒక్క సారి పాద యాత్ర తద్వారా సమస్యలు అంతర్గత రోడ్లు శానిటేషన్ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పేదల పెన్నిధి సిఎం సహాయ నిధి

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న శంకర్ నాయక్

దుండిగల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి పథకం అని, ఈ సహాయ నిధి పథకం నిరంతర సేవలతో వందలాది మంది పేదలకు భరోసాగా నిలిచి ఆరోగ్యాలకు స్వస్థత చేకూర్చుకునేందుకు దోహదపడిందని కొర్ర శంకర్ నాయక్ అన్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తాండకు చెందిన కొర్ర రేఖ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమాచారం అందించారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన వారు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. మంజూరైన రూ.2 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాన్ని బుధవారం శంకర్ నాయక్ లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరమని, అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సహాయం అందడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, సంబంధిత నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లలో కొంపల్లి సర్కిల్-56కు విశిష్ట విజయం

కొంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్-56 ఆస్తి పన్ను వసూళ్లలో విశేష ప్రతిభ కనబరిచినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన వసూళ్లలో భాగంగా, 5 శాతం రిబేట్ పథకం కింద నిర్దేశించిన రూ.12.24 కోట్ల లక్ష్యాన్ని నెలాఖరు ముగియడానికి రెండు రోజుల ముందుగానే 100శాతం పూర్తి వసూళ్లు చేసినట్లు వెల్లడించారు. ఈ విజయంతో కార్పొరేషన్ స్థాయిలో కొంపల్లి సర్కిల్-56 రెండవ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.ఇదే సమయంలో రిబేట్ పథకానికి గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనున్నందున, ఇంకా పన్నులు చెల్లించని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే బకాయిలను చెల్లించాలని అధికారులు సూచించారు. గడువు ముగిసేలోపు చెల్లిస్తే రిబేట్ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్, కొంపల్లి సర్కిల్-56 ప్రజలకు పన్ను చెల్లింపులపై అవగాహన పెంపొందిస్తూ, అందరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.

సహజ సంఘటనలతో కథాసాహిత్యాన్ని సృజించాలి : డా. నామోజు బాలాచారి

రవీంద్రభారతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : కథలు వ్రాయాలంటే ముందుగా రచయితలుగా ఎదగాలన్న తపన్సంకల్పం ఉండాలని, రచయితలు తమ చుట్టుపక్కల జరుగుతున్న సంఘటనలనే వస్తువుగా తీసుకుని కథాసాహిత్యాన్ని సృజిస్తే పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బాలాచారి నేతృత్వంలో ఒక్కరోజు కథాకార్యశాల సుసంపన్నమైంది. ఈ సదస్సులో కథలు ఎలా వ్రాయాలి? కథా నిర్మాణ పద్ధతులు, కవులు కథావస్తువు ఎలా ఎంచుకోవాలి, శిల్పం, భాష లాంటి వివిధ అంశాలపై ప్రముఖ కథకులు పెద్దింటి అశోక్‌కుమార్, స్వర్ణ కిలారి, బి.వి.ఎన్.స్వామి తదితర వక్తలు తగిన సూచనలు, మెళకువలు తెలియజేశారు. ఏ కథకునికైనా పరిశీలన శక్తి ముఖ్యమని, పరిశీల ఉంటే మన చుట్టుపక్కలనే కథలకు వస్తువులు ఉంటాయని పెద్దింటి అశోక్‌కుమార్ అన్నారు. కథకు పాత్ర, పాత్ర పోషణ, భాష,శిల్పం, శైలి ముఖ్యమని, అన్నింటికీమించి ప్రారంభంలోనే కథ పాఠకుడిని చదివింపజేశాలా ఉండాలని, ఏ సన్నివేశమైనా సంభాషణలతో మొదలుపెండితే కథను చదివింపజేసే బలం ఎక్కువ ఉంటుందని, సందర్భాన్నిబట్టి కొన్ని

కథాకార్యశాల, సదస్సులో పాల్గొన్న బాలాచారి, బిఎస్.రాములు, ఔత్సాహికులు, నూతన యువ కవి, కవయిత్రులు

కథలలో మలుపులు ఉండాలని బివిఎన్.స్వామి సూచించారు. కథకు కావలసిన అభివ్యక్తీకరణ గురించి వివిధ రచయితల కథల్లోని అనేక సందర్భాలను వ్యక్తపరుస్తూ స్వర్ణకిలారి కథామెలకువలు తెలిపారు. చివరిగా పాఠకులు అడిగిన అనేక ప్రశ్నలకు వక్తలు సమాధానం చెప్పారు. తర్వాత కథలు ఎలావ్రాయాలో వారికి అప్పటికప్పుడు అరగంట సమయంలో అందరిచేత కథలు వ్రాయించి అభ్యాసం చేయించి వారిలోపాలను సూచనప్రాయంగా సభలో వివరించారు. సభకు హాజరైన అతిథులను సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. బాలాచారి, రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ బి.ఎస్.రాములుతో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

కొంపల్లి సర్కిల్‌లో జనగణన స్వీయ నమోదు ప్రారంభం

కొంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

కొంపల్లి సర్కిల్ పరిధిలోని పట్టణ ప్రజలకు అధికారులు కీలక సూచనలు జారీ చేశారు. జనాభా గణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ స్వీయ గణన కార్యక్రమం ఏప్రిల్ 26, 2026 నుండి మే 10, 2026 వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది.ఈ నేపథ్యంలో కొంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు ప్రక్రియను పూర్తి చేయవచ్చని, కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా ధృవీకరణ చేసుకుని తదుపరి వివరాలను నమోదు చేయాలని సూచించారు.అలాగే జిల్లా, పట్టణం లేదా గ్రామం, పిన్ కోడ్ వివరాలతో పాటు మొబైల్‌లో లొకేషన్‌ను ఆన్ చేసి మ్యాప్‌లో నివాస స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. ఇల్లు, కుటుంబానికి సంబంధించిన వివరాలను నమోదు చేసిన అనంతరం వాటిని పరిశీలించి సమర్పించాల్సిందిగా సూచించారు.సమర్పణ అనంతరం హెచ్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ఈ ఐడీ లభిస్తుందని, దాన్ని భద్రపరచుకోవాలని అధికారులు పేర్కొన్నారు. మే 11 తరువాత ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఐడీ చూపించి ధృవీకరణ పొందవచ్చని తెలిపారు.ప్రజలు స్వయంగా నమోదు చేసుకుని సమయాన్ని ఆదా చేసుకోవాలని చార్జ్ సెన్సస్ అధికారి, డిప్యూటీ కమిషనర్, కొంపల్లి సర్కిల్ 56 విజ్ఞప్తి చేశారు.

టెన్త్ ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు మెరుగు

- వంద శాతంతో మూడు - సత్తాచాటిన గురుకులం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : పదవ తరగతి ఫలితాలలో ఫలక్‌నుమా ఫారూక్‌నగర్‌లోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. మొత్తం 80 మంది విద్యార్థినులు వార్షిక పరీక్షలు హాజరు కాగా 79 మంది ఉత్తీర్ణులై 99 శాతం ఫలితాలు సాధించారు. ఎం.లహరి (583/600) అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచారు. 30 మందికిపైగా విద్యార్థులు 500ల మార్కులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వి.జయంతి వెల్లడించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని అభినందించారు. ఇక పాతబస్తీలోని బండ్లగూడ, బహదూర్‌పురా, చార్మినార్ జోన్ల ఫలితాలలో గత సంవత్సరం కంటె మెరుగుదల కనిపించింది. బండ్లగూడ జోన్‌లోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 578 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 449 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైయ్యారు. 77.68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జోన ఉప విద్యాశాఖ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మైసారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని (575/600), చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అంభికా స్వామి (543/600), ఈదిబజార్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని జీనత్ ఉన్నిసా (525/600) టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. బహదూర్‌పురా జోన్‌లోని 26 ప్రభుత్వ పాఠశాలల నుండి 798 మంది విద్యార్థులు హాజరు కాగా

వంద శాతం ఫలితాలు సాధించిన అంధ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వారిలో 669 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆ జోన్ ఉప విద్యాశాఖ అధికారి సుమన్ రాథోడ్ తెలిపారు. జోన్‌లో 84 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. శాలిబండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.వరలక్ష్మి (566/600), ఎన్.ప్రవీణ్ కుమార్ (539/600), కె.శివ సాయి (533/600) ఉత్తమ మార్కులతో రాణించారన్నారు. దారుల్‌షిఫా ప్రభుత్వ అంధుల పాఠశాల, చార్‌మహల్, మొఘల్‌పురా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించినట్లు వివరించారు. చార్మినార్ జోన్‌లోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 453 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 352 మంది పాసైయ్యారని ఆ జోన్ ఉప విద్యాశాఖ అధికారి కె.శ్రావణ్ కుమార్ తెలిపారు. మొత్తం మీద 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. సుల్తాన్‌షాహి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.సాయి శరణ్య యాదవ్ (555/600) మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు.

బహదూర్‌పుర జోన్‌లో 84 శాతం,చార్మినార్ జోన్‌లో 80 శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణత

చార్మినార్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త :

పదివ తరగతి పరీక్షలలో బహదూర్‌పుర జోన్ పరిధిలో 84 శాతం,చార్మినార్ జోన్ పరిధిలో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు.బహదూర్‌పుర జోన్ పరిధిలోని 798మంది విద్యార్దులు పదివ తరగతి పరీక్షలు రాయగా వారిలో 669 మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అయ్యారని బహదూర్‌పుర జోన్ ఉప విద్యాధికారి సుమన్ తెలిపారు.కాగా శాలిబండ జిబిహెచ్ఎస్‌లో చదివిన సొంట వరలక్ష్మీకి 566 మార్కులు వచ్చాయి.పాతబస్తీ రాజన్న బావి ప్రాంతానికి చెందిన వరలక్ష్మీ తండ్రి ఆటో నడుపుతూఇద్దరు ఆడపిల్లలను చదివిస్తున్నాడు.శాలిబండ జిబిహెచ్ఎస్‌లో పదివ తరగతి చదివిన ఎన్.ప్రవీణ్ కుమార్‌కు 539 మార్కులు,కె.శివ సాయికి 533 మార్కులు వచ్చాయని ప్రధానోపాధ్యాయులు కె.రాంమోహన్ తెలిపారు.హైస్కూల్‌కు చెందిన 23 మంది విద్యార్దులు ఎస్ఎస్‌సి పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణులు అయ్యారనిఆయన తెలియజేశారు.కాగా చార్మినార్ జోన్ పరిధిలో ఎస్ఎస్‌సి పరీక్షలలో 80శాతం మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అయ్యారు.జోన్ పరిధిలో 453 మంది విద్యార్దులు ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరు కాగా వారిలో 352 మంది విద్యార్దులు పాస్ అయ్యారని చార్మినార్ జోన్ ఉప విద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు.

కాగా సుల్తాన్‌షాహి జిబిహె చ్ఎస్‌లో చదివిన డి.సాయి చరణ్య యాదవ్‌కు 555 మార్కులు ఎస్ఎస్‌సి పరీక్షలో లభించాయి.పదివ తరగతి ఫెయిల్ అయిన విద్యార్దులలో గణితం,సైన్సు సబ్జెక్టులలో తప్పారని విద్యాధికారులు తెలిపారు.

విఫలమైన విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దని పిలుపు

- తెలంగాణ విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్ ఏప్రిల్ 29 ప్రభాతవార్త : రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కాగా, ఈసారి మొత్తం 95.15 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం పట్ల తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన ఈ విజయానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 2.37 శాతం పెరగడం విశేషం. బాలికలు పై చేయి సాధించడం అభినందనీయమని వేముల రామకృష్ణ అన్నారు. ఫలితాల అనంతరం వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అదే సమయంలో పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు సంయమనం పాటించాలని

ప్రసంగిస్తున్న తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

కోరారు. "ఫలితాలు ఆశించినట్టు రానంత మాత్రాన విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దు. వారికి అండగా నిలిచి ధైర్యం చెప్పాలి. ఒక పరీక్ష వైఫల్యం జీవితాంతం ఉండదని గుర్తించాలి" అని ఆయన హితవు పలికారు.

దోభిఘాట్‌లో పవర్‌బోరు మాయం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : పాతబస్తీ ఫలక్‌నుమా వంతెన వద్ద గల ధోబి ఘాట్‌లోని పవర్‌బోర్ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ జంగయ్య కథనం ప్రకారం... మంగళవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫలక్‌నుమా వంతెన వద్ద గల దోభిఘాట్‌లోని స్మశాన వాటికలోకి ప్రవేశించారు. అందులో గల 1.5 హార్స్‌పవర్ పవర్ బోరుకు ఉన్న విద్యుత్ తీగలను కత్తిరించి సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్ మోటారును, దానికి ఉన్న ఇనుప పైపులను తస్కరించారు. బుధవారం ఉదయం దోభిఘాట్‌కు వచ్చిన రజకులు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు దర్యాప్తు కొనసాగుతుంది.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Sameena Sultana Begum W/o. Mohammed Elyas R/o. H.No. 26-64/1, Qutubullapur, Medchal Malkajgiri, T.G Changed My Name as Sameena Sultana.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

ప్రకటన నెం : 139/UBD/CRZ/GHMC/2026-27 తేది: 28.04.2026

నగరంలో రమణీయత పెంపొందింప చేయుటకు చార్మినార్ జోన్, UBD, మూసారాంబాగ్, సర్కిల్-29లో చాదర్‌ఘాట్ సర్కిల్ వద్ద బాల్ డోమ్ ఫౌంటెన్ ద్వారా జంక్షన్ యొక్క సుందరీకరణ నెలకొల్పుటకు GHMC ఉద్దేశిస్తోంది. ఈ విషయంలో నమోదిత ఏజెన్సీ నుండి పేర్కొన్న టైమ్‌లైన్‌కు కొటేషన్‌లు ఆహ్వానిస్తోంది. 1) ప్రకటన డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు సమయం : ప్రారంభ తేది: 29.04.2026 ఉ.11.00గం. ఆపై నుండి. 2) ప్రకటన డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ : తేది: 04.05.2026 మ.3.00గం. వరకు. 3) కొటేషన్‌ల దాఖలుకు చివరి తేది మరియు సమయం : తేది: 04.05.2026 మ.3.30గం. వరకు. 4) కొటేషన్‌లు తెరచుట: తేది: 04.05.2026 సా.4.00గం. వద్ద. 5) కొటేషన్‌లు దాఖలు చేయవలసిన స్థలం: డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయో డైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, GHMC, 2వ అంతస్తు, పురానాపూల్, హైదరాబాద్. వెబ్‌సైట్ www.ghmc.gov.in నుండి వివరాలు పొందుట/డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సం/-. డిప్యూటీ డైరెక్టర్, పట్టణ జీవవైవిధ్య విభాగం, చార్మినార్ జోన్, GHMC.

పెట్రోల్ బంకుల వద్ద భద్రత కల్పించాలి : బ్రహ్మయ్య

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): ఇబ్బందికరంగా మారిన పెట్రోల్ డీజిల్ సమస్యను పరిష్కరించడంతో పాటు పెట్రోల్ బంకుల వద్ద భద్రత చర్యలను కట్టుదిట్టం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దపూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. పెట్రోల్ సమస్య తలెత్తడంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ తీవ్రమైనప్పటికీ ప్రభుత్వము, పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మండుటెండలో పెట్రోల్ కోసం వస్తున్న వాహనదారులకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేసే విధంగా పెట్రోల్‌బంక్ యజమానులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజల భద్రతను విస్మరిస్తే మాస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం: పున్న

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చెరుకు సంగీత, పిఎంఆర్ రాజు, రాజారెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా పనిచేస్తుందని శ్రీరామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. శ్రీరామకృష్ణపురం డివిజన్ వాసవికాలనీ రోడ్‌నెంబర్ 1/ఎ లో పలు సమస్యలను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పున్న గణేష్‌నేత పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్ దీపాల స్తంభం, రోడ్డును ఆక్రమించి రోడ్డుమీద గుడిసెలు వేసుకోవడం తదితర సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గణేష్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తొలగించమని విజ్ఞప్తి చేశారు. వాసవికాలనీ రోడ్ నెంబర్ 1/ఎ లో సిసి రోడ్డు మంజూరి చేయించడం జరిగిందన్నారు. రెండుమూడు రోజుల్లో బడ్జెట్ మంజూరి కాగానే వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కొత్తగా సిసి రోడ్డు పండ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో రామకృష్ణాపురం డివిజన్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవికాలనీ రోడ్ నెంబర్ 1/ఎ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెల్లా జగన్నాథం, కార్యదర్శి మల్లేష్‌యాదవ్, లింగారెడ్డి, నాగరాజు, పురుషోత్తం, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్, సుధాకర్‌శర్మ, సుధాకర్‌గుప్తా, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే పెట్రోలు, డీజిల్ సమస్య

పెట్రోలు బంకు వద్ద ఆందోళన చేస్తున్న రవి ముదిరాజ్ తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ కొరత సమస్య ఏర్పడిందని బిఆర్ఎస్ ఎల్‌బినగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్ అన్నారు. డీజిల్, పెట్రోల్ కొరతను నిరసిస్తూ పెట్రోల్ బంకు వద్ద ఆందోళన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు పెట్రోలు, డీజిల్ సమస్య లేదని చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయని అన్నారు. పెట్రోలు, డీజిల్ దొరకక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తెల్లవారుఝామునుండే పెట్రోలు బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారని అన్నారు. సమస్యను అడ్డుపెట్టుకుని కొందరు పెట్రోలు బంకు యజమానులు ఇష్టారీతిగా ప్రవరిస్తున్నారని అన్నారు. కొన్ని చోట్ల పెట్రోలు, డీజిల్‌ను బ్లాకులో అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. చాలా చోట్ల బంకుల వద్ద ఘర్షణ వాతావరణం తలెత్తుతుందన్నారు. పరిస్థితిని చక్కదిద్ది వాహనదారులకు పెట్రోలు, డీజిల్ తగినంత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. లేకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రవి ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, గణేష్, బాలి, లక్ష్మణ్, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో విజయ దుందుభి మ్రోగించిన బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు : చైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి

పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్స్ డైరెక్టర్ ప్రసాదరావు తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 29, (ప్రభాతవార్త): పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించి తమ సత్తాను చాటారని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్స్ చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ బ్రిలియంట్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో విద్యార్థులతో కలిసి బాణాసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ 1536 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 100 ఉత్తీర్ణత సాధించారని వివరించారు. పలువురు విద్యార్థులు 587, 583, 582 లు మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా 758 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా సాధించారని, 656 మంది విద్యార్థులు 550ల మార్కులకు పైగా సాధించారని, 122 మంది విద్యార్థులు 500ల మార్కులకు దిగువన సాధించి విజయ దుందుభి మ్రోగించారని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో, ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని వివరించారు. పాఠ్యాంశాలను బోధించడంతోపాటు అన్ని అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ జెవిడి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ మధురవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో రూ.6 కోట్లు విలువ చేసే పార్కు స్థలాల కబ్జాపై ఫిర్యాదు

-డిసి సమ్మయ్యను కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్న రామిడి శూరకర్ణారెడ్డి

-సదరు స్థలాలను స్వాధీనం చేసుకొని ప్రజోపయోగార్థం చేయాలని వినతి

రాత్రికి రాత్రే ప్రహరీగోడలు నిర్మించారని ఆరోపిస్తూ రామిడి శూరకర్ణారెడ్డి ఫిర్యాదు చేసిన ఆక్రమణకు గురైన పార్కు స్థలం

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ రెవెన్యూ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16లోని నాదర్‌గుల్ డివిజన్-57 కిందకు వచ్చే అల్మాస్‌గూడలో దాదాపు రూ.6 కోట్ల విలువ చేసే 1295 గజాల్లో ఉన్న రెండు పార్కు స్థలాలను స్థానిక పట్టాదారులు కబ్జాలోకి తీసుకున్నారనీ ఈ నేపథ్యంలో తక్షణమే సదరు స్థలాలను స్వాధీనం చేసుకొని బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమీషనర్‌ను స్థానిక అల్మాస్‌గూడ గ్రామ నివాసి అయిన తెలంగాణ రాష్ట్ర బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం సర్కిల్ కార్యాలయంలో డిసిని కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్మాస్‌గూడ రెవెన్యూ సర్వే నెంబర్ 31, 32, 33, 34లో (ప్రస్తుతం ఉన్న రామిడి కళావతినగర్ కాలనీ) వెంచర్ చేసిన సమయంలో పురాతన చింతచెట్టును కొట్టివేసి అక్కడ ఉన్న బావిని పూడ్చి పార్కు స్థలంగా లేఔట్‌లో చూపించి అమ్ముకున్నారని తెలిపారు. అట్టి స్థలాన్ని ప్రస్తుతం పట్టాదారులే కబ్జా చేస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. అదే విధంగా బిఎస్ఆర్ కాలనీలో 1001 గజాల స్థలాన్ని సైతం కబ్జాకు గురైందని ఆయన అన్నారు. వెంచర్ చేసిన సమయంలో ప్రభుత్వ భూమిలో ఉన్న స్మశానవాటిక స్థలాన్ని పార్కుగా చూపించి లేఔట్ ప్లాట్లు అమ్ముకున్నారనీ అయితే తాజాగా పార్కుగా చూపించిన స్థలాన్ని కబ్జాలోకి తీసుకొన్నారని ఆయన వివరించారు. ఈ రెండు స్థలాల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో కబ్జాకు గురైన సదరు స్థలాలను స్వాధీనం చేసుకొని ప్రహరీగోడలు నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని శూరకర్ణారెడ్డి డిసిని కోరారు. కాగా రాత్రికి రాత్రే స్థానికులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డిలు ఆయా పార్కు స్థలాలకు చుట్టూ కంపోండ్ వాల్‌లు నిర్మించి కబ్జా చేశారని శూరకర్ణారెడ్డి ఆరోపిస్తున్నారు. అయితే తమ వినతికి స్పందించిన డిసి సదరు పార్కు స్థలాలను స్వాధీనం చేసుకుంటామని హామీనిచ్చారని ఆయన తెలిపారు. ఆక్రమణలకు గురైన రామిడి కళావతినగర్, బిఎస్ఆర్ నగర్‌లో పార్కు స్థలాలను స్థానిక కాలనీలవాసులకు ఉపయోగంలోకి తీసుకొచ్చే వరకు రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా శూరకర్ణారెడ్డి స్పష్టం చేశారు.

వైభవంగా శ్రీ మహాకాళిదేవి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

రామంతాపూర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : రామంతాపూర్‌లోని శ్రీ మహాకాళిదేవి విగ్రహ ప్రతిష్ట, ద్వార దేవతల యంత్ర విగ్రహ ప్రతిష్ట, కుంబాభిషేకం కార్యక్రమాలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మంటప అవాహిత దేవతా హోమము, కళాన్యాస హోమము, పీఠ పూజ, కళాన్యాస హోమం, గర్త సంస్కారం, పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతీ స్వామీజీ చే యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కుంబాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ విద్యా శంకర భారతీ స్వామీజీ దివ్య భాష్యం నిర్వహించారు. అనంతరం నేత్ర సమ్మేళనం, బలి హారణం, పూర్ణాహుతి, దేవిదర్శనం, అన్న సమారాధన, సాయంత్రం వేదాశ్వీరచనము, పండిత సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి ప్రతిష్ట ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. విగ్రహ ప్రతిష్టాపన మన సనాతన ధర్మాన్ని, సాంప్రదాయాలను కాపాడుతుందని, రాబోయే తరాలకు మన సంస్కృతిని అందిస్తుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సుర్వి బీష్మ గౌడ్, ధీకొండ శ్రీనివాస్, సముద్రాల నాగేందర్, కమిటి సభ్యులు సర్వ సత్తయ్య యాదవ్, రేవు కృష్ణయ్య, పాలకూర దాస్ గౌడ్, బుర్ర రాజేశ్వర్, లింగాల నరేష్ గౌడ్, బుర్ర మహేందర్, బిఆర్ఎస్ పార్టీ నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, సల్ల రాజిరెడ్డి, డి.బాలరాజు, మేకల మధు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఎం.డి.తౌఫిక్, ఎండి.రఫీక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, గణేష్ నాయక్, అరుణ్ పటేల్, సందీప్, భాస్కర్, షాగా శ్రీధర్, ముత్యాల బాబు, ఎస్.ఎం జంగయ్య, కృష్ణ, ఎం జంగయ్య, ముత్యాల బాబు, బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్తా, వల్లపు జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాకాళిదేవి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతీ స్వామీజీ తదితరులు

శ్రీ సత్యదేవుడి ఆలయంలో కూలిన ధ్వజ స్థంభం

-తప్పిన ప్రమాదం ...తాత్కాలిక ధ్వజ స్థంభం ఏర్పాటు

రామంతాపూర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం ధ్వజ స్థంభం ప్రమాదవశాత్తు పడిపోయింది. ఉదయం ఒక్కసారిగా జరిగిన సంఘటనతో ఆలయ పండితులు, నిర్వాహకులు ఆందోళన చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ధ్వజ స్థంభం ఒక వైపు ఒరిగి కింది పడిపోయింది. దీంతో ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అప్పటికే అక్కడికి చేరుకున్న పూజారులు గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ భారతి, ట్రస్టీ కోట్ల నరసింహారెడ్డి, శంకర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆలయం పూజారులు తిరిగి తాత్కాలికంగా పూజలు నిర్వహించి మరో ధ్వజ స్థంభం ఏర్పాటు చేశారు. 2003లో ఏర్పాటు చేసిన ధ్వజ స్థంభం నీరు వెళ్లి పుచ్చిపోయిందని, అధికారులను సంప్రదించి తిరిగి కొత్త ధ్వజ స్థంభం ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామంతాపూర్‌లోని శ్రీ సత్యదేవుడి ఆలయంలో ప్రమాదవశాత్తు పడిపోయిన ధ్వజ స్థంభం దృశ్యం.

అల్మాస్‌గూడ ప్రాంత ప్రజా సమస్యలను పరిష్కరించండి

-డిప్యూటీ కమిషనర్‌కు రాఘవేందర్‌రెడ్డి వినతి

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్-57 కిందకు వచ్చే అల్మాస్‌గూడ ప్రాంతాలకు సంబంధించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్యను కోరారు. బుధవారం డిసి అల్మాస్‌గూడ శివాజీ చౌక్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఉన్న ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ఇక్కడి నుండి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ ప్రమాదాలకు సైతం గురవుతున్నారని డిసికి వివరించారు. ఈ నేపథ్యంలో రహదారి దుస్థితి తీవ్రత దృష్ట్యా ఇక్కడ గతంలో నిలిచి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని కోరారు. అదే విధంగా ఆయన సౌభాగ్యనగర్, స్వేచ్ఛానివాస్, వినాయకహిల్స్, శ్రీశ్రీ హోమ్స్ నుండి జయశంకర్ కాలనీ వరకు ఉన్న డ్రైనేజీ సమస్యలను సైతం అధికారుల దృష్టికి తెచ్చారు. కాగా స్థానిక అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంపై స్పందించిన డిసి వాటిని తొలగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చినట్లు రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ డిఇఇ అభినవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు ప్రజా సమస్యలు వివరిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

టెన్త్ ఫలితాల్లో మీర్‌పేట్ నారాయణ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన నారాయణ ఎజిఎం రవీంద్రబాబు

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మీర్‌పేట్ నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన ఇక్కడి విద్యార్థులు అద్భుతమైన మార్కులతో టాప్ టెన్‌లో నిలిచారు. ఎ.వైష్ణవి అనే విద్యార్థిని 600 మార్కులకు గాను ఏకంగా 593 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అదే విధంగా 592 మార్కులతో దుర్గా శరణ్య, 590 మార్కులతో ప్రణతిలు స్టేట్ ర్యాంకులు సాధించారు. ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన మీర్‌పేట్ నారాయణలో 590కి పైగా మార్కులు ముగ్గురు, 580కి పైగా మార్కులు 14 మంది, 550కి పైగా మార్కులు 64 మంది సాధించడం విశేషం. కాగా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచి ర్యాంకులు సాధించిన విద్యార్థినిలను నారాయణ ఎజిఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జి తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కట్టుకున్న భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

-60 యేండ్ల వయస్సులో దారుణానికి పాల్పడ్డ నిందితుడు

-అక్రమ సంబంధం అనుమానంతోనే ఘాతుకం

హత్యకుగురైన వసంత(ఫైల్ ఫోటో)

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): అక్రమ సంబంధం పెట్టుకున్నదనే అనుమానంతో కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా గొడ్డలితో విచక్షణారహితంగా నరికి చంపాడు ఓ భర్త. 52 సంవత్సరాల వయస్సు ఉన్న భార్యను 60 సంవత్సరాల వయస్సులో ఉన్న భర్త అత్యంత పాశవికంగా అంతమొందించడం సంచలనంగా మారింది. ఈ దారుణ సంఘటన హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. తీవ్ర కలకలం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నా యి. నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన నల్లబోతు నర్సింహ (60), వసంత (52)లు భార్యా భర్తలు. వీరు జీవనోపాధి నిమిత్తం కొంత కాలం క్రితం నాగార్జున సాగర్ రోడ్డులోని బిఎన్‌రెడ్డినగర్ సమీపంలోనున్న టీచర్స్ కాలనీలో కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. నర్సింహ లేబర్ పనులు, వసంత ఇళ్లల్లో పని మనిషిగా చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింహ బుధవారం ఆమెపై గొడ్డలితో దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. దీంతో మెడ, చేతికి, ఇతర శరీర భాగాలపై తీవ్ర గాయాలు కావడంతో రక్తపు మడుగులో విలవిలలాడిన వసంత ఘటనా స్థలంలోనే ప్రాణా లు విడిచింది. దారుణానికి ఒడిగట్టిన నిందితుడు హత్యకు ఉపయోగించిన గొడ్డలిని అక్కడి చెట్ల పొదల్లో విసిరేసి నేరుగా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు తెలిసింది. అయితే సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం వసంత మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు వాడిన గొడ్డలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హతురాలి కుమారుడు నల్లబోతు సైదులు నుండి ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు కేసును అన్ని కోణాల నుండి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త): చాలాకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం అయిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని రామాంజనేయ కాలనీలో బుధవారం పర్య టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.66లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు మంజూరు చేసి పూర్తి చేయించామన్నారు. ఇంకా సుమారు 70మీ టర్ల మేర డ్రైనేజీలైన్ పనులు మిగిలి ఉన్నాయని వాటి ని కూడా త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. కాలనీలో మంచినీటి సమస్య కూడా పరిష్కారమైందని, కొన్ని గల్లీలలో కొత్తగా మంచినీటి లైన్లు నిర్మిస్తామన్నారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి మిగిలిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీతప్రశాంత్‌గౌడ్, సీనియర్ బారాస నాయకులు అనంతుల రాజిరెడ్డి, పోచంపల్లి రాజేందర్‌రెడ్డి(పిఎంఆర్ రాజు), చిరంజీవి, జి.సతీష్ యాదవ్, అనంతుల శ్రీనివాస్‌రెడ్డి, పల్లె సీతారాములు, రమేష్, సత్తిరెడ్డి, వెంకటరాములు, రవి, రాంచందర్, ప్రేమ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో ఉప్పల్ మండల విద్యార్థుల ప్రతిభ

ఉప్పల్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : ఉప్పల్ మండల పరిధిలోని బుధవారం విడుదల అయిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు మండల విద్యాధికారి రామరావు తెలిపారు. మండల పరిధిలోని హబ్సిగూడ, కొత్తపేట, మల్లాపూర్, నాగోల్, రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్, తిరుమల్‌నగర్‌లోని పాఠశాలలో మొత్తం 767 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 616 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. హబ్సిగూడ పాఠశాలలో మోహన్ రూప్ సాయిరాం 534, వి.రాఘవ 529, కొత్తపేట పాఠశాలలో మహాలక్ష్మి 561, వైష్ణవి 541 మార్కులు సాధించారని తెలిపారు. మల్లాపూర్ పాఠశాలలో సి.లావణ్య 525, ఆర్.మౌనిక 509, వి.ఆరతి 507 మార్కులు, నాగోల్ పాఠశాలలో ఎ.బిందు 573, నందిని 553, హర్షవర్ధన్ 552 మార్కులు, రామంతాపూర్ పాఠశాలలో కె.కీర్తి 551చ శిఖ 550 మార్కులు, ఉప్పల్ పాఠశాలలో ఎన్.రిషి 554, బి.చైత్రిక 531 మార్కులు, చిలుకానగర్ పాఠశాలలో పి.అక్షయ 541, కె.సాయిరాం 525 మార్కులు, బి.అశ్విని 524, తిరుమల్‌నగర్ పాఠశాలలో సీలం కావ్య 450, పి.వైష్ణవి 423 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఉప్పల్‌లో కొత్త రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు.

ఉప్పల్ న్యూ భరత్‌నగర్ కాలనీ రహదారిలో రోడ్డు వేసి క్యూరింగ్ చేయకుండా వదిలివేసిన దృశ్యం.

ఉప్పల్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : ఉప్పల్ సర్కిల్ పరిధిలో కోట్ల రూపాయల వ్యయంతో వేస్తున్న కొత్త రోడ్లు కొద్ది కాలానికే పాడైపోతున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు వేసే సమయంలో సరిగ్గా క్యూరింగ్ చేయకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి వేసిన రోడ్లు కొద్ది కాలానికి పాడైపోతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భరత్‌నగర్ నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు సుమారు రెండు కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రోడ్డు పనుల విషయంలో కాంట్రాక్టర్లు నీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నాలుగు నెలల తర్వాత అష్టకష్టాలు పడిన తర్వాత వేసిన రోడ్డు విషయంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. రోడ్డు వేసిన వెంటనే విధిగా నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉండగా దీనిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలివేశారని, రోడ్డు పక్కన ఉన్న గుంతలు పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. వేసవిలో సిసి రోడ్లు నీటి క్యూరింగ్ చేయకపోతే కొద్ది కాలానికే శిథిలం అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



నేరెడ్ మెట్ , ఏప్రిల్ 29,(ప్రభాతవార్త) : అధికారంలో ఉన్నా లేకున్నా తమ డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కాకతీయ నగర్‌లోని శ్రీయ హాస్పిటల్ లైన్ పరిధిలో రూ.38 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు ఆమె ప్రా రంభిచారు. పనులు ప్రారంభమైన సందర్భంగా కాలనీ వాసులు ఆమెను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ప్రాజెక్టుకు సంబంధించిన పలు సందేహాలను వ్యక్తం చేయగా, క్యానం రాజ్యలక్ష్మి వాటిపై స్పష్ట తనిచ్చారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సాయిబాబా, కాలనీ అధ్యక్షుడు బాబురావు గౌడ్, థామస్, తిప్పారెడ్డి, సాయి ప్రసాద్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయి సురేష్, వెంక టేష్ పాల్గొన్నారు.

నూతన సివరేజ్ పైప్ లైన్లను ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే బలాల

జలమండలి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట, ఏప్రిల్ 29, (ప్రభాతవార్త): మలక్ పేట్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం నూతన సీవరేజ్ పైప్ లైన్లను ఏర్పాటు చేయాలని మలక్ పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. జలమండలి ప్రాజెక్టు అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రధానమైన సీవరేజ్ పైపులైన్లను మరింతగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా మంచినీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డీజీఎం వంశీ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన భాష్యం హై స్కూల్ విద్యార్థులు

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి తదితరులు

మలక్ పేట, ఎప్రిల్ 29, (ప్రభాతవార్త): పదవ తరగతి పరీక్ష ఫలితాలలో దిల్ షుక్ నగర్ భాష్యం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారని భాష్యం హై స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం హై స్కూల్ లో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు నిర్వహించారు. అదే విధంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆమె పుష్పగుచ్చాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధే తమ విద్యాసంస్థల ధ్యేయమని పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ శాఖ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త) : తెలంగాణ కళాశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జిజ్ఞాస విద్యార్థి అధ్యయన యోజన రాష్ట్ర స్థాయి పోటీలకు ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నాలుగు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వాణిజ్యశాస్త్రం వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్ సత్యనారాయణ, రసాయన శాస్త్రం అకడమిక్ కోఆర్డినేటర్ కె.గీత, భౌతిక శాస్త్రం డా.వి.శ్రీనివాసారావు, వృక్షశాస్త్రం డా.ఆర్. చంద్రసాగర్ పర్యవేక్షణ చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. విద్యార్థులలో క్షేత్రస్థాయిలో పరిశోధన పట్ల ఆసక్తి మరింత పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిజ్ఞాస ప్రాజెక్టుల సమన్వయకర్త డా.ఆర్.చంద్రసాగర్ తదితరులను వక్తలు డా.జి. తిరుపతయ్య, పి.విజయ్ కుమా ర్, జె.విశ్వనాదజ్ కుమార్, డాఎస్.యమునారాణి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో చలివేంద్రం ప్రారంభం

నేరెడ్ మెట్ , ఏప్రిల్ 29,(ప్రభాతవార్త) : వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సినీ పోలీస్ సమీపంలో చలివేంద్రం, మజ్జిగ కేంద్రం మరియు పుచ్చపండ్ల పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎస్‌ట జీఎన్‌వి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబాన్న జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రతలో ప్రజలకు తాగునీరు, మజ్జిగ, పండ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చే యువతను ప్రోత్సహించడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి.కే. శ్రీనివాస్, సిరిగిరి నర్సింగరావు, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, కన్నా, యాదగిరి, ఇస్తారి, శ్రీరామ్ యాదవ్, బ్రహ్మయ్య, పిట్టల నాగరాజు, సయ్యద్ మబ్బు, సురేష్ సింగ్, సందీప్ గౌడ్, ఆశా, శారద, వినయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.